# శత్రువు

**జా**నకమ్మ ఆలోచిస్తూనే వుంది. ఒక రోజు కాదు... రెండు రోజులుకాదు వారం రోజులు గడిచిపోయాయి. గంటలు గడుస్తున్న కొద్దీ గుండె బరువెక్కసాగింది. ''ఇదిగో'' వస్తానని చెప్పి వెళ్లినవాడు ఇంతవరకూ రాలేదు. వస్తున్నట్టు కబురూ లేదు. ఎదురు చూస్తూనే వుంది. కళ్లు కాయలు కాస్తున్నాయి. ఆమె కొడుకు వచ్చే సూచనలు కనిపించడంలేదు.

బెడ్‌పై పడుకుని ఉన్న భర్త రాఘవరావువైపు చూసింది. మడతలు పడ్డ ముఖం. అతని వయస్సు అరవైపైబడి వుంటుందనే విషయం ముఖం చూస్తే ఇట్టే చెప్పేయవచ్చు. అతనింకా నిద్రలేవలేదు. కాలుకి పెద్దబ్యాండేజి వుంది. వెల్లకిలా పడుకున్నాడు. కాలు కదిపేందుకు వీలు లేకుండా ఉంది. అతన్నుచూసి జానకమ్మ మనసు ఆర్ద్రమైంది. సరిగ్గా వారం రోజుల క్రితం రాఘవరావు బాత్రూమ్‌లో కాలు జారి పడ్డాడు. మోకాలు విరిగింది. హాస్పిటల్ చేర్చారు. డాక్టరు సిమెంటు కట్టు వేశాడు. రెండు నెలల వరకూ బెడ్‌మీద ఉండాలన్నారు. డాక్టరుకు కొంత ఫీజు ఇచ్చి మిగతా డబ్బులు తీసుకువస్తానని చెప్పి వెళ్లిన కొడుకు ఇంతవరకూ రాలేదు. వార్డు రెంట్ కూడా కట్టలేదు. అతని జాడ కూడా లేదు.

డాక్టరు తనిఖీకొచ్చే వేళయింది. జానకమ్మ గుండె వేగంగా కొట్టుకోసాగింది. ''ఇదిగో... అదుగో...'' అని ఇంతవరకూ కాలం వెళ్ల బుచ్చింది. కానీ ఈ రోజు ఏం చెప్పినా డాక్టరు వినడు. ఏం చేయాలో తోచడంలేదు. ''వయసులో ఉన్నప్పుడు ఎన్నో బాధలు పడ్డాం. ఫర్వాలేదు. కానీ ఈ ముసలితనంలో బాధలేమిట్రా భగవంతుడా'' అనుకొంది మనసులో.

డాక్టరు పక్క వార్డుకొచ్చాడు. జానకమ్మ గుండె ఝల్లుమంది. ఆందోళనతో ఏమీ తోచడంలేదు. కాలుకాలిన పిల్లిలా అటు ఇటూ తిరుగుతోంది. ఒళ్లంతా చెమటలు పట్టాయి. డాక్టరు వచ్చాడు. జానకమ్మ నిలుచుంది నేలచూపులు చూస్తూ. పేషంట్‌ని తేరిపార చూసి ''ఏమ్మా! మీ అబ్బాయి వచ్చాడా?'' అన్నాడు.

జానకమ్మ తృళ్లిపడి కళ్లజోడు సర్దుకుని ''వస్తాడండి'' అన్నది వణికే గొంతుకతో.

''నేనడిగింది అది కాదమ్మా... వచ్చాడా? లేదా?'' అన్నాడు రెట్టించి.

''రాలేదు బాబు!'' అంది విచారంగా.

''సిమెంట్ కట్టువేసిన తర్వాత మందులు బాగా వాడాలి. లేకపోతే చాలా ప్రమాదం'' అన్నాడు. ఫీజు ఇవ్వకపోవడం పేషంట్‌కి ప్రమాదం అనే విషయాన్ని పరోక్షంగా చెప్పాడు. పేషంట్‌పైపుతేరిపార చూసి అసహనంగా కదిలాడు డాక్టరు.

డాక్టరు వెంటవచ్చిన నర్సు మాత్రం కదల్లేదు.

''సిమెంటు కట్టుకట్టినందుకు డాక్టరు ఫీజు ఇవ్వలేదు. మీరు ఉన్న గదికి వారం రోజులుగా అద్దెకట్టలేదు. మీ అబ్బాయి వస్తాడో రాడో మాకు అనవసరం. సాయంత్రానికల్లా బిల్లు చెల్లించకపోతే పేషంట్‌ని వరండాలో పడేస్తారు. తర్వాత మీ ఇష్టం'' ఖండితంగా అంది నర్సు.

జానకమ్మ కళ్లనీళ్ళునిండాయి. దుఖం ఆపుకోలేక పోయింది. భర్త పక్కనే బెడ్‌మీద కూర్చుని చిన్నగా ఏడుస్తోంది. రాఘవరావుకదిలాడు. కళ్ళు తెరిచాడు. జానకమ్మ కళ్లలో నీళ్ళుచూసి కంగారు పడ్డాడు. ''ఏమైంది జానకీ'' అన్నాడు మెల్లగా.

''అబ్బాయి రాలేదండీ'' అంది ఏడుపు ఆపి.

''అంతేగదా! ఆ మాత్రం దానికే ఏడుపెందుకు?''

''వాడిప్పుడు రాకపోతే ఎలాగండీ?''

''ఏమవుతుంది?'' రాఘవరావు నుదురు చిట్లించాడు.

''సాయంత్రంలోగా డబ్బు కట్టకపోతే వరండాలో పడేస్తామని సీరియస్‌గా చెప్పిందండి నర్సు.''

''వాళ్లు అలాగే అంటారులే...'' మామూలుగా అన్నాడు రాఘవరావు.

''వాడు రాలేదు సరే... కనీసం కోడలుకూడా రాలేదు చూడండి.''

''ఎందుకొస్తుంది... రౌతనుబట్టే గుర్రమూను...''



''ఏమిటో మీ మాటలు నాకేమీ అర్థం కావడంలేదు. మనమింత ఆపదలో ఉన్నామంటే కారణం వాడు కదూ?''

''వాడు కారణమా! అదేమిటి?!'' అన్నాడు ఆశ్చర్యంగా.

''మీ కళ్ల అద్దాలు మార్చమని మూడు నెలల నుండి చెబుతున్నా వాడు పట్టించుకోలేదు. పైగా ఖర్చట. వాడికొడుక్కి సైకిలు కొంటే ఖర్చు కాదా? వాడు అప్పుడే కళ్లద్దాలు కొని వుంటే మీరు కాలుజారి పడేవారా? ఇంత ప్రమాదం జరిగేదా?''

''వాడన్నదీ నిజమే జానకి. మనకింద పెట్టే ఖర్చుకి రాబడి ఉండదు. వాడి కొడుకు కింద పెట్టే ప్రతి పైసాకి రాబడి ఉంటుంది.''

''కన్నవాళ్ల క్రింద అయ్యే ఖర్చుకి లాభనష్టాలు చూడాలంటారా?''

''తప్పదు జానకీ... లోకమంతా డబ్బుమయం అయిపోయింది. ఈ పరిస్థితుల్లో పెట్టే ప్రతి పైసాకి రాబడి చూస్తారు. అదంతే.... ఎవర్నీ నిందించలేం...''

''తల్లీ... తండ్రీ... అనే బంధాలకు అర్థం ఏమిటండీ?''

''ఇంకా ఎక్కడున్నావ్ జానకీ... వాటి నిర్వచనాలెప్పుడో మారిపోయాయి. మంచికి, మానవత్వానికి విలువ ఉన్న రోజుల్లోని మాటలవి. ఇప్పుడు వాటి స్థానాన్ని డబ్బు ఆక్రమించింది. దానితో మానవతా విలువల నిర్వచనాలు మారిపోయాయి. మారుతున్న కాలాన్ని బట్టి మనమూ మారకపోతే మనుగడ సాగించలేము.'' ఉపన్యాసధోరణిలో అన్నాడు రాఘవరావు.

''చిన్నప్పటినుండి పెంచి పెద్ద చేసాం. విద్యాబుద్ధులు నేర్పించాం. వాడినో ప్రయోజకుడిగా తీర్చిదిద్దాం. ఇదంతా ఎందుకు చేసినట్టు?''

''అది నీ బాధ్యత...''

''తల్లిదండ్రిని చూడాల్సిన బాధ్యత వాళ్లకు లేదా?''

''ఉందని వాళ్లనుకోవాలి. ఈ కాలం పిల్లలు అలా అనుకోవడం లేదు. కాబట్టి మనం మారాలి. వాళ్లపై ఆధారపడటం మానెయ్యాలి. అంతరిక్షంలో అడుగుపెట్టినా మన ఆలోచనా విధానం మారలేదు. ఈ విషయంలో మనం పశుపక్ష్యాదుల్ని చూసి నేర్చుకోవాలి. అవి మనలాగే పిల్లల్ని పెంచి పెద్దచేస్తాయి. రెక్కలు వచ్చి పిల్లలు ఎగిరిపోతే మా సంగతేమిటి అని అడగవు. బాధపడవు'' చెప్పడు రాఘవరావు.

''పిల్లల్ని చిన్నప్పుడే వదిలేశామా?''

''వదిలి వేయలేం. అది మనగొప్ప కాదు. మనకు తెలియకుండానే కొన్ని పనులు చేస్తాం. ప్రకృతి మన చేత అలా చేయిస్తుంది. చెట్టుకు చిగురుటాకుమీద ఉన్న శ్రద్ధ పండుటాకు మీద ఉండదు. సృష్టి తన కార్యక్రమ నిర్వహణలో అవసరమైన దానిని ఉంచి, అనవసరమైన వాటిని నిర్దాక్షిణ్యముగా తొలగించుకొంటూ పోతుంది. అది ప్రకృతి ధర్మం...''

భర్త ఎంత చెప్పినా జానకమ్మ మనసులో ఏదో వెలితిగా వుంది. ''మనం పుత్రుడు అనుకున్నాం గాని వాడు మనకి శత్రువండి!'' అంది ఉన్నట్టుండి ఒకేసారిగా.

రాఘవరావు చిన్నగా నవ్వాడు.

''శత్రువు వాడుకాదు జానకీ. మన వార్థకమే మనకు నిజమైన శత్రువు. వార్ధక్యం రాగానే మన కాళ్లూ... చేతులు... ఒకటేమిటి శరీరంలో అన్ని భాగాలు ఎదురుతిరుగుతాయి. చెప్పి

బి.వేణుగోపాలరావు

నట్టు వినకుండా మొరాయిస్తాయి. బాధలు పడతాం. అనేక ఇబ్బందులకు గురి అవుతాం. వీటన్నిటికీ మూలకారణం వార్ధక్యమేనని తెలుసుకోకుండా, మనపిల్లల్ని, అయిన వాళ్లని, కాని వాళ్లని నిందించడం ప్రారంభిస్తాం. అది చాలా పొరపాటు. మనం ఆ శత్రువుని ఎదుర్కొనే మార్గం చూడాలి. అప్పుడే మన సమస్యలన్నీ పరిష్కారం అవుతాయి'' అన్నాడు గంభీరంగా.

గీతాసారాన్ని బోధిస్తూ కృష్ణ భగవానుడిలా కనిపించాడు. అతని వివరణ నూటికి నూరుపాళ్ళు నిజమనిపించింది. జానకమ్మకి ఆత్మస్థైర్యం కల్గింది. మనసుకొంత తేలిక కనిపించింది. భర్త ఎన్నిచెప్పినా ఆమె నొక సందేహం వదల్లేదు.

''మీరు చెప్పినదంతా నిజమేనండి కాదనను. కానీ మనం ఆపదలో ఉన్నాం. ముందీ ఆపద నుండి గట్టెక్కడమెలా?'' అన్నాదామె నిట్టూరుస్తూ.

రాఘవరావు చిరునవ్వు నవ్వి ''ఇంత చెప్పిన వాడిని ఆ మాత్రం ముందుగా ఊహించలేనా? పదిహేను సంవత్సరాల క్రితం పదివేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాను. ఆ విషయం నీకు కూడా చెప్పలేదు. అదిప్పుడు సుమారు అర్వై వేలు అవుతోంది. రేపటితో గడువుతీరి పోతుంది. వెళ్లి తీసుకోవచ్చు'' అన్నాడు.

''నిజామా...!!'' అన్నదాశ్చర్యంగా.

''నిజమే జానకీ... ఎప్పటికైనా పనికొస్తుందని వేశాను. అది ఈనాటికి పనికొచ్చింది. మనమేకాదు, ఈ రోజుల్లో ప్రతి తల్లిదండ్రీ పిల్లల భవిష్యత్తుతోబాటు తమ భవిష్యత్తు గురించి ముందుగానే ఆలోచించి, అందుకు తగిన ప్లాన్ వేసుకోవాలి'' అన్నాడు.

''అబ్బాయికి తెలిస్తే మోసం చేశామనుకోడూ'' సందేహంగా అన్నదామె.

''మరివాడు చేసింది మోసం కాదా... అయినా ఇందులో మోసం ఏముంది? వాడికి విద్యాబుద్ధులు నేర్పించాం. గవర్నమెంటు జాబు చేస్తున్నాడు. ఓ ఇంటివాడయ్యాడు. ఇంకా ఏం కావాలి'' అన్నాడు.

జానకమ్మ మనస్సు చల్లబడింది. హాయిగా నిట్టూర్చింది.

★

# ''మారు వేషాల్లో మహారాజులు, మహానాయకులు''

మహారాజులు తమ పరిపాలనా సంగతుల గురించి ప్రజల్లో మారు వేషాల్లో సంచరించి తెలుసుకునే వారన్న విషయాలు మనం కాశీ మజిలీ కథల్లో చదివాం. కానీ రాజులు వారి మంత్రులు ప్రజా సంబంధాలను పాటించిన వాస్తవిక కథలతో మన దేశ చరిత్ర నిండి ఉంది. పాండ్య రాజైన ''పొర్కై పాండ్యన్'' తన నిజ స్వరూపం ఎవరికీ తెలియకుండా మారు వేషంతో రాత్రుళ్ళు నగరంలో తిరుగుతూ వ్యక్తులను, వారి సంపదలను, సంఘ విద్రోహ శక్తుల నుండి ఎలా కాపాడే వాడో మనం చదువుకున్నాం. మైసూరు మహారాజు మైసూరు సంస్థానాన్ని పాలించే రోజులలో 'సర్ మీర్జా ఇస్మాయిల్ దివాన్' ప్రధానమంత్రిగా ఉండేవాడు. ఆ సంస్థానపు పాలనా వ్యవస్థ ప్రతిపక్షంలో ప్రముఖ తీవ్ర కాంగ్రెస్ వాది శ్రీ కె.జి. భాష్యం అయ్యంగార్ ఉండేవాడు. ఒక సందర్భంలో బ్రిటీష్ వారి సిద్ధాంతాల వైపు మొగ్గను చూపుతున్న సంస్థానపు సిద్ధాంతాలను గురించి ఆయన చేసిన తీవ్ర విమర్శ కారణంగా దివాన్ విమర్శకు గురయ్యాడు. సంస్థానం బ్రిటీష్ వారి ఆదరణకు పాత్రమై ఉన్నందువల్ల శ్రీ భాష్యం అయ్యంగారు రాజద్రోహ నేరానికి గురి కావచ్చునని అసెంబ్లీ సభ్యులు అనుకున్నారు. కానీ అలా జరగలేదు. అందర్నీ విభ్రాంతుల్ని చేసే సంఘటన జరిగింది. అసెంబ్లీ నాయకులైన సర్‌మీర్జా ఇస్మాయిల్ నవ్వుతూ అయ్యంగారే ఉపన్యాసాన్ని విన్నాడు అప్పుడప్పుడు ఆయన అయ్యంగార్ని ప్రశంసిస్తూ వచ్చాడు. ఆ రోజు సాయంకాలం తన వ్యక్తిగత కార్యదర్శిని పిలిచి మేలురకం మామిడి పండ్లను కొని అందంగా పాక్ చేయండి. మీ మిత్రుడు ప్రేమతో అన్న వాక్యాన్ని పాకెట్‌పై వ్రాసి అయ్యంగార్ ఇంటికి పంపాడు. రాజకీయపరమైన అభిప్రాయ బేధాలు అప్పుడప్పుడూ కలిగినా అప్పటినుంచే వారిద్దరూ జీవితాంతం ప్రాణమిత్రులుగా ఉండిపోయారు. ఇది చక్కటి ప్రజా సంబంధాలను పాటించే సరళమైన పద్ధతి. తనకు తెలియకుండానే సర్‌మీర్జా ఇస్మాయల్ ఒక వ[illegible] ప్రజా సంబంధాల పద్ధతికి శ్రీకారం చుట్టి రాజకీయ విరోధిని తన వశం చేసుకునేందుకు దాన్ని ఒక ఉపకరణంగా వాడాడు. [illegible] గత జీవితంలో ప్రజా సంబంధాల్ని ఒక వ్యక్తి ఎలా పాటించాడో! తెలియాలంటే మరో ఉదాహరణ. శ్రీ మాధరావు పీష్వా మంత్రి మండలిలో శ్రీరామశాస్త్రి ప్రజల సమస్యలను, అధికారుల సంబంధాలనే కాకుండా రాజు ఆదరాభిమానాలను కూడా విపరీతంగా పొందాడు. మంచి సామర్థ్యంగల వ్యక్తి మాత్రమే కాకుండా అసలైన నిజాయితీ పరుడిగా పేరుపొందిన రామశాస్త్రి సాధారణ జీవితాన్ని గడిపేవాడు. మహారాష్ట్రుల ఉగాది గుడిపాడ్వా రోజున శ్రీమతి రామశాస్త్రిని రాజమహలుకు రాజమాత ఆహ్వానమందించింది. భర్త అనుమతితో ఆ ఇల్లాలు రాజమాత ఆహ్వానాన్ని స్వీకరించింది. రాజమాత రామశాస్త్రి భార్యకు మంచి విందు భోజనం ఇచ్చి పట్టుచీరను, ముత్యాల హారాన్ని బహుమతిగా ఇచ్చింది. తానూ, తన భర్త జీవిస్తున్న తీరుకు ఈ కానుకలు విరుద్ధంగా ఉన్నాయని చెబుతూ వాటిని స్వీకరించడానికి ఆమె ఇష్టపడలేదు. కానీ రాజమాత బలవంతం చేయడంతో అయిష్టంగానే ఆ కానుకలను ఆమె స్వీకరించింది. రాజమహల్ సిబ్బంది వెంట రాగా శ్రీమతి రామశాస్త్రి పల్లకిలో తన ఇల్లు చేరింది. ఇల్లు చేరిన వెంటనే రాజ్‌మహల్ సిబ్బంది లోగొంతుకతో శ్రీమతి రామశాస్త్రి వచ్చినట్లు శ్రీ రామశాస్త్రితో చెప్పింది. శ్రీ రామశాస్త్రి తన భార్యను చూడటానికి ఇంటి బైటకు వచ్చాడు. ముత్యాల హారాన్ని ధరించిన తన భార్యలో అతడు యవ్వనవతి అయిన స్త్రీని చూసాడు. రామశాస్త్రికి పరిస్థితి ఏమిటో క్షణంలో అర్ధమయింది. వెంటనే అతడు మహలు సిబ్బందిని పిలిచి–''మీరు పొరపాటుగా ఈ ఇంటి తలుపులు తడుతున్నారు'' అని అన్నాడు. రాజలాంఛనాలతో కూడిన వస్తువులను ధరించే రామశాస్త్రిని చూసేందుకు అలవాటు డిన ఆ సిబ్బంది సాధారణ వస్త్రధారణ చేసుకున్న రామశాస్త్రిని గుర్తించలేకపోయారు. తెలివి తేటల్లో ఏమాత్రం తీసుపోని శ్రీమతి రామశాస్త్రి కూడా పరిస్థితులను అర్ధం చేసుకోగలిగింది. ఆమెసబ్బందిని పిలిచి మళ్ళీ తనను రాజ్‌మహల్‌లో చేర్చవలసిందిగా ఆజ్ఞాపించింది. రాజమాతకు అనేక విధాలుగా నచ్చ చెప్పి ఇచ్చిన కానుకలలో అధిక భాగాన్ని వాపసు చేసి సాధారణ వేషధారణతో తన ఇల్లు చేరింది. ఇంటి ముందు పల్లకీ దిగిన వెంటనే సిబ్బందిని వెళ్ళిపొమ్మని కోరింది. ఆ తరువాత ఆమెస్వయంగా చిరునవ్వుతో తలుపు తట్టింది. శ్రీరామశాస్త్రి ఎప్పటిలా భార్యను ఆహ్వానించడం జరిగింది. ఇలాంటి చాలామంది ప్రముఖుల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగి చూస్తే కొన్ని విచిత్రమైన సంఘటనలు గోచరిస్తుంటాయి.

–పి.వి. రమణకుమార్

త్వరలో కొత్త శీర్షిక

## ధర్మ సందేహాలు

శాస్త్ర విషయాలు తెలుసుకుంటున్నప్పుడు, పురాణగాథలు చదువుతున్నప్పుడు, వర్తమాన జీవితగమనంలోనూ అనేక సందేహాలు రావడం అత్యంత సహజం.. ద్రౌపది దుర్యోధనుడిని చూసి నవ్విందా? రావణుడు సీతను స్పృశించాడా? లేదా?, శ్రీకృష్ణుడు 16వేల మంది గోపికలను పెళ్లాడాడా? పూర్వం ఆయుఃప్రమాణం తక్కువ వుండేది.. ఇప్పుడు పెరిగింది. ఇది సైన్స్ ప్రభావమా.. బ్రహ్మదేవుడు రాత మార్చాడా?, , ఇలాంటి ఎన్నో సందేహాలకు ఇప్పుడు ఆదివారం ఆంధ్రభూమిలో సమాధానాలు లభించనున్నాయి. పురాణేతిహాసాలపై సాధికార వ్యాఖ్య చేయగల సుప్రసిద్ధ పండితుడు, బహుగ్రంథ రచయిత ఏలూరిపాటి అనంతరామయ్య మీ సందేహాలకు సమాధానాలిస్తారు. మీ సందేహాలను వెంటనే కార్డుపై రాసి పంపండి. చిరునామా- ఎడిటర్, ధర్మసందేహాలు, ఆంధ్రభూమి ఆదివారం అనుబంధం, 36, సరోజినీ దేవి రోడ్, సికిందరాబాద్-3